AKSHARA TODAY
# అక్షర టుడే
TOWARDS... TRUTH. TRUST. TREND
WWW.AKSHARATODAY.IN

31-3-2026 (Tuesday) MAIN EDITION

## ఇరాన్ పై బంకర్ బస్టర్లతో విరుచుకుపడ్డ అమెరికా



**అక్షరటుడే, నేషనల్ డెస్క్:** ఇరాన్‌పై అమెరికా భీకర స్థాయిలో విరుచుకుపడింది. అణుకేంద్రాలు ఉన్న కీలక నగరం ఇస్ఫహాన్ పై బాంబు దాడులు చేసింది. ఆయుధ నిల్వలు ఉన్న ఓ డిపోపై బంకర్ బస్టర్లతో దాడి చేసింది. దీంతో అక్కడ భారీగా మంటలు చెలరేగాయి. ఈ దాడికి సంబంధించిన వీడియోను అమెరికా అధ్యక్షుడు ట్రంప్ 'ట్రూత్' సోషల్ లో పోస్టు చేశారు. దాడికి సంబంధించి ఆయన ఎలాంటి వివరణ ఇవ్వలేదు. అయితే, ఆయుధ నిల్వలు ఉన్న ఓ డిపోపై అమెరికా ఇజ్రాయెల్ ఈ దాడులు చేశాయని మీడియా కథనాలు వెల్లడిస్తున్నాయి.

## పోలీసుల ముందు బైక్‌తో స్టంట్లు.. షాకిచ్చిన పోలీసులు..




**అక్షరటుడే, హైదరాబాద్ సిటీ:** హైదరాబాద్ నగరంలో పలువురు పోకిరీలకు పోలీసులు షాక్ ఇచ్చారు. నలుగురు యువకులు పోలీసుల ఎదుటే బైక్‌తో స్టంట్లు చేశారు. పోలీస్ కారును ఓవర్ టేక్ చేసి, ముందకు వెళ్లిన తర్వాత స్టంట్లు చేశారు. అంతేగాకుండా దానిని వీడియో కూడా తీశారు. పోలీసులు వెంటనే వారిని ఆపి నలుగురు యువకులను అదుపులోకి తీసుకున్నారు. ఈ ఘటన హైదరాబాద్ నగరంలోని అత్తాపూర్‌లో చోటు చేసుకుంది. దీంతో పోలీసులు వెంటనే వారిని వెంబడించి అదుపులోకి తీసుకున్నారు.

## బీజేపీ నాలుగో విడత జాబితా విడుదల



అక్షరటుడే, నేషనల్ డెస్క్ : పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ ఎన్నికలు త్వరలో జరుగన్నాయి. ఈ నేపథ్యంలో పార్టీలు తమ అభ్యర్థుల జాబితాను విడుదల చేస్తున్నాయి. ఇందులో భాగంగా బీజేపీ ఇప్పటికే మూడు విడతల్లో తమ అభ్యర్థుల జాబితాను వెల్లడించింది. తాజాగా 13 మంది అభ్యర్థులతో కూడిన నాలుగో విడత జాబితాను విడుదల చేసింది.

## అస్సాం బీజేపీ మేనిఫెస్టో విడుదల




అక్షరటుడే, నేషనల్ డెస్క్: అస్సాం అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో బీజేపీ మంగళవారం మేనిఫెస్టోను విడుదల చేసింది. మొత్తం 31 హామీలతో కూడిన మ్యానిఫెస్టోను అస్సాం ముఖ్యమంత్రి హిమంత బిశ్వశర్మ, ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ సహా పలువురు నేతలు రిలీజ్ చేశారు. కాగా.. అస్సాంలో ఏప్రిల్ 9న పోలింగ్ జరగనుంది.

## చల్లపల్లి పోలీస్ స్టేషన్ లో భారీ పేలుడు



అక్షరటుడే, ఏపీ: ఆంధ్రప్రదేశ్‌లోని కృష్ణా జిల్లా చల్లపల్లి పోలీస్ స్టేషన్‌లో పేలుడు సంభవించింది. దీంతో నలుగురు పోలీసులకు తీవ్రగాయాలయ్యాయి. గాయపడిన వారిలో ఎస్సైతో పాటు డ్రైవర్, ఇద్దరు కానిస్టేబుళ్లు ఉన్నారు. వీరిని స్థానికంగా ఉన్న ఆస్పత్రికి తరలించారు. పేలుడు ధాటికి స్టేషన్ లోని ఫర్నిచర్, బయట నిలిపి ఉంచిన వాహనాలు దెబ్బతిన్నాయి.

## 'హేట్ స్పీచ్ బిల్లుతో సీఎం రేవంత్ రెడ్డి కుట్ర'




**అక్షరటుడే, హైదరాబాద్:** హేట్ స్పీచ్ బిల్లుతో రేవంత్ రెడ్డి కుట్రకు తెరలేపారని బీఆర్ఎస్ నేత ఆర్ఎస్ ప్రవీణ్ అన్నారు. బీఎన్ఎస్, ఐటీ యాక్ట్ 67 ప్రకారం హేట్ స్పీచ్ అనేది నేరమన్నారు. ఈ రెండిట్లో శిక్ష గురించి క్లియర్‌గా చెప్పినప్పటికీ.. రేవంత్ రెడ్డి కావాలని కుట్ర చేశాడని మండిపడ్డారు. మూడేళ్ల జైలు శిక్ష ఉంటే, ఏడు నుంచి పదేళ్లకు పెంచారన్నారు. స్టేషన్ బెయిల్ ఇస్తుండడంతో కావాలని ఏడు నుంచి పదేళ్లకు శిక్ష పెంచారని వ్యాఖ్యానించారు. అన్యాయాన్ని ప్రశ్నించే వారిని జైలులో పెట్టాడానికే బిల్లు తెచ్చారని విమర్శించారు. ఈ హేట్ స్పీచ్ అనేది తెలంగాణ ప్రజల నోటికి తాళాలు వేయడం కోసమే తెచ్చారన్నారు.

## పట్టాలు తప్పిన గూడ్స్ రైలు

**అక్షరటుడే, ఏపీ :** ఏపీలోని నెల్లూరు జిల్లాలో గూడ్స్ రైలు పట్టాలు తప్పింది. రెండు వ్యాగన్లు బోల్తా పడ్డాయి. కొమ్మరపూడి రైల్వే జంక్షన్ సమీపంలో ఘటన చోటుచేసుకుంది. కొమ్మరపూడి రైల్వే జంక్షన్ సమీపంలో ట్యాంకర్ గూడ్స్ రైలు మంగళవారం ఉదయం పట్టాలు తప్పింది. దీంతో రైళ్ల రాకపోకలకు అంతరాయం కలిగింది. సమాచారం అందుకున్న రైల్వే అధికారులు, సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకున్నారు. సహాయక చర్యలు చేపట్టారు. పట్టాలు తప్పి బోల్తా పడిన వ్యాగన్లను సరి చేయడానికి 200 మంది సిబ్బంది కృషి చేస్తున్నారు. రైలు విజయవాడ నుంచి తిరుపతి వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగింది.

**మార్చి నెల ముగింపునకు వచ్చేసింది. రేపటినుంచి మరో కొత్త నెల ప్రారంభం కాబోతోంది. దీనికి ప్రత్యేకత ఉంది. ఏప్రిల్ 1వ తేదీ అంటే సాధారణ నెల ప్రారంభం మాత్రమే కాదు.. కొత్త ఆర్థిక సంవత్సరానికి తొలి రోజు. నూతన సంవత్సరంలో ఎన్నో ఆర్థిక పరమైన మార్పులు మొదలవనున్నాయి. రేపటినుంచి వచ్చే కీలక మార్పుల గురించి తెలుసుకుందాం..**

—అక్షరటుడే, బిజినెస్ డెస్క్




# కొత్త ఆర్థిక సంవత్సరం.. మార్పులివే..

■ రేపటినుంచి అమలులోకి.. ■ పాన్ కార్డ్ నుంచి బ్యాంకింగ్ సేవల వరకు..

ఆదాయపు పన్ను చట్టం 1961 స్థానంలో కొత్త ఇన్‌కమ్ ట్యాక్స్ యాక్ట్ 2025ని కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చింది. ఏప్రిల్ 1 నుంచి ఇది అమలులోకి వస్తోంది. సరళమైన భాషలో ఈ చట్టాన్ని రూపొందించారు. ట్యాక్సులు, ట్యాక్స్ శ్లాబుల యథాతథంగా కొనసాగనున్నాయి. గతంలో ఫైనాన్షియల్ ఇయర్, అసెస్‌మెంట్ ఇయర్ అని రెండు ఉండేవి. దీంతో ట్యాక్స్ పేయర్లు గందరగోళానికి గురయ్యేవారు. ఇకపై ఏప్రిల్ 1 నుంచి మార్చి 31 వరకు ఉండే సమయాన్ని ట్యాక్స్ ఇయర్ గా వ్యవహరించనున్నారు.

**హైదరాబాద్ వాసులకూ అవకాశం..**

హౌస్ రెంట్ అలవెన్స్ కింద బేసిక్ పేలో 50 శాతం పన్ను మినహాయింపు క్లెయిమ్ చేసుకునే నగరాల జాబితాను పెంచారు. ఇందులో హైదరాబాద్‌కూ చోటు దక్కింది.

**బేసిక్ పే 50 శాతం..**

కొత్త లేబర్ కోడ్స్ అమలులోకి రానున్నాయి. దీని ప్రకారం ఉద్యోగుల శాలరీ మొత్తంలో బేసిక్ పే 50 శాతంగా ఉండనుంది. దీంతో పీఎఫ్, గ్రాట్యుటీ వంటివి పెరుగుతాయి.

**పాన్ కార్డ్ జారీలో కొత్త నిబంధనలు..**

ఇప్పటివరకు ఆధార్ కార్డు ఉంటే కేవలం కేవైసీతోనే ఇన్ స్టంట్ పాన్ కార్డు పొందడానికి అవకాశం ఉంది. ఈ విధానంలో మార్పులు చేశారు. ఇకపై ఆధార్ కార్డుతో పాటుగా ఓటర్ ఐడీ, పాస్ పోర్ట్, బర్త్ సర్టిఫికెట్ వంటి ధ్రువీకరణ పత్రాలు అవసరం.

**వీటికి పాన్ తప్పనిసరి..**

బ్యాంకు ఖాతాలో ఒక ఆర్థిక సంవత్సరంలో రూ.10 లక్షలు అంతకంటే ఎక్కువ నగదు ఒకేసారి లేదా విడతల వారీగా జమ చేసినా, విత్ డ్రా చేసినా పాన్ వివరాలు ఇవ్వాల్సి ఉంటుంది. ప్రస్తుతం ఒక రోజులో రూ.50 వేలు దాటితే పాన్ అడుగుతున్నారు. ఇళ్లు, స్థలాల కొనుగోలు, విక్రయం, గిఫ్ట్ లేదా జాయింట్ డెవలప్‌మెంట్ అగ్రిమెంట్ల విషయంలో ట్రాన్సాక్షన్ విలువ రూ.20 లక్షలు దాటితే ఇకపై పాన్ వివరాలు తప్పనిసరి. ప్రస్తుతం ఈ పరిమితి రూ.10 లక్షలుగా ఉంది. టూవీలర్ లేదా ఏ వాహనమైనా కొనుగోలు చేసినప్పుడు దాని ధర రూ. 5 లక్షలు

**ఫాస్టాగ్ వార్షిక పాస్ ధర పెంపు..**

నేషనల్ హైవేస్ అథారిటీ ఆఫ్ ఇండియా ఫాస్టాగ్ వార్షిక పాస్ ధరను పెంచింది. ప్రస్తుతం రూ. 3 వేలు ఉండగా.. రూ. 3,075 కు పెరిగింది.

**సేవా రుసుముల పెంపు..**

హెచ్డీఎఫ్సీ, పీఎన్బీతోపాటు పలు బ్యాంకులు తమ కస్టమర్లకు షాక్ లు ఇవ్వడానికి రెడీ అయ్యాయి. ఏటీఎం నుంచి నగదు ఉపసంహరణ పరిమితులు దాటితే వసూలు చేసే చార్జీలు, బ్యాంక్ లాకర్ ఫీజులు, ఎఫ్‌డీల వడ్డీ రేట్లలో మార్పులు చేశాయి.

## ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డికి సీఐడీ నోటీసులు



**అక్షరటుడే, హైదరాబాద్:** హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డికి సీఐడీ అధికారులు నోటీసులు జారీ చేశారు. ఏప్రిల్ 4న విచారణకు రావాలని ఆదేశించారు. కరీంనగర్ జిల్లా వీణవంకలో జనవరిలో మినీ మేడారం జాతర జరిగింది. వేడుకలకు జనవరి 29న ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి తన కుటుంబ సభ్యులు, అనుచరులతో వెళ్లారు. అయితే మార్గమధ్యలో పోలీసులు ఆయనను అడ్డుకున్నారు. అంతమంది వెళ్లడానికి అనుమతించలేదు. దీంతో కౌశిక్‌రెడ్డి రోడ్డుపై ధర్నా చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. కరీంనగర్ సీపీపై అనుచిత వ్యాఖ్యలు చేశారు. ఆయనపై మతం పేరుతో వ్యాఖ్యలు చేశారు. దీనిపై అప్పుడు దుమారం రేగింది. ఐపీఎస్ అసోసియేషన్ సైతం ఎమ్మెల్యే వ్యాఖ్యలను ఖండించింది. దీంతో ఎమ్మెల్యే క్షమాపణలు సైతం చెప్పారు. కాగా.. పాడి కౌశిక్‌రెడ్డిపై పోలీసులు కేసు నమోదు చేశారు. కరీంనగర్ కమిషనర్ పట్ల వివాదాస్పద వ్యాఖ్యలు చేశారని కేసు పెట్టారు. కేసును సీఐడీకి అప్పగించడంతో ఏప్రిల్ 4న విచారణకు రావాలని చెప్పారు.

## సైబర్ నేరాల నియంత్రణలో బ్యాంక్ సిబ్బంది పాత్ర కీలకం




**అక్షరటుడే, హైదరాబాద్ :** సైబర్ నేరాల నియంత్రణలో బ్యాంక్ ఉద్యోగుల పాత్ర కీలకమని హైదరాబాద్ సీపీ సజ్జనార్ అన్నారు. సైబర్ నేరాలపై అవగాహన కల్పిస్తూ ఆయన ఓ వీడియో విడుదల చేశారు. ప్రజల సొమ్ముకు కాపలాదారులుగా ఉన్న బ్యాంకర్లు తమ కస్టమర్ల పట్ల మరింత బాధ్యతగా ఉండాలని సీపీ అన్నారు. వారు ఏదైనా మోసానికి గురవుతున్నట్లు గమనిస్తే వెంటనే అప్రమత్తం చేయాలని సూచించారు. ముఖ్యంగా డిజిటల్ అరెస్టులు, పెట్టుబడి మోసాల బారిన పడినప్పుడు కస్టమర్లు తమ డిపాజిట్లను హుటాహుటిన విత్‌డ్రా చేయడం, బంగారంపై పెద్ద ఎత్తున అప్పులు తీసుకోవడం వంటివి చేస్తుంటారని చెప్పారు. అటువంటి సమయాల్లో వారి ప్రవర్తనలో ఏవైనా అసాధారణ మార్పులు, ఆందోళన కనిపిస్తే అది సైబర్ ముఠాల పనేమోనని ఆరా తీయాలన్నారు.

## అర్ధరాత్రి దంచికొట్టిన వాన.. పలు జిల్లాలకు రెడ్ అలెర్ట్




**అక్షరటుడే, హైదరాబాద్ :** అకాల వర్షాలు అన్నదాతలను ఆగం చేస్తున్నాయి. మంగళవారం అర్ధరాత్రి పలు జిల్లాల్లో భారీ వర్షం కురిసింది. దీంతో ఆరబెట్టిన పంటలు తడిసిపోయాయి. తెలంగాణలోని నిర్మల్, ఆదిలాబాద్, నిజామాబాద్, కామారెడ్డి, సిరిసిల్లలో వాన దంచికొట్టింది. ఆ జిల్లాలకు అధికారులు రెడ్ అలెర్ట్ జారీ చేశారు. జగిత్యాల, మంచిర్యాల, ఆసిఫాబాద్, కరీంనగర్, పెద్దపల్లి, భూపాలపల్లి, ములుగు, మెదక్, సిద్దిపేట జిల్లాల్లో సైతం వర్షం పడింది. మంగళవారం సైతం పలు ప్రాంతాల్లో తేలిక పాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావారణ శాఖ అ ధికారులు తెలిపారు. అక్కడక్కడ వడగళ్ల వాన పడే ఛాన్స్ ఉంది. అకాల వర్షాలతో రైతులు నష్టపోతున్నారు. ఆరబెట్టిన ధాన్యం, పసుపు తడిసిపోయింది. కోతకు వచ్చిన సమయంలో వర్షాలతో వడ్లు నేలరాలాయని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

## ఆలయంలో తొక్కిసలాట.. 8 మంది మృతి



**అక్షరటుడే, నేషనల్‌డెస్క్:** బీహార్‌లో తీవ్ర విషాదం చోటుచేసుకుంది. నలంద జిల్లాలోని శీతల మాత ఆలయంలో మంగళవారం తొక్కిసలాట చోటు చేసుకుంది. ఈ ఘటనలో 8 మంది భక్తులు మృతి చెందారు. నలందాలోని శీతలా మాత ఆలయంలో మంగళవారం కావడంతో భక్తులు పూజల కోసం తరలివచ్చారు. ప్రతి మంగళవారం ప్రార్థనల కోసం భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయానికి వస్తారు. చైత్ర మాసంలోని చివరి మంగళవారం కావడంతో రద్దీ అధికంగా ఉంది. ఈ క్రమంలో ఆలయం లోపల అకస్మాత్తుగా గందరగోళం చెలరేగి, తొక్కిసలాట జరిగింది. ప్రజలు తప్పించుకునే ప్రయత్నంలో, తీవ్రమైన తొక్కిసలాటలో పలువురు కోల్పోయారు. ఈ ఘటనలో పలువురు తీవ్రంగా గాయపడ్డారు. వారిని చికిత్స కోసం సదర్ ఆసుపత్రికి తరలించారు.

## భారీగా కల్తీ అల్లం వెల్లుల్లి పేస్ట్ స్వాధీనం



**అక్షరటుడే, హైదరాబాద్ సిటీ:** హైదరాబాద్ నగరంలో కల్తీ ఆహార పదార్థాల తయారీపై పోలీసులు కఠిన చర్యలు చేపడుతున్నారు. ఈ క్రమంలో రోజుకో కల్తీ దందా వెలుగు చూస్తోంది. తాజాగా హైదరా బాద్ మైలార్‌దేవపల్లి పరిధిలోని కాటేదాన్‌లో ఉన్న ఎస్.కె.ఆర్ ఫుడ్ ప్రొడక్ట్స్ ప్రాంగణంలో హెచ్ -ఫాస్ట్ బృందం దాడులు చేసింది. 4,032 కిలోకల కల్తీ అల్లంవెల్లుల్లి పేస్ట్‌ను స్వాధీనం చేసుకుంది. నగరంలోని రెస్టారెంట్లు, హోల్ సేల్, కిరాణ దుకాణాలకు దీనిని సరఫరా చేస్తున్నట్లు అధికారులు గుర్తించారు. నిందితుడు హసన్ అలీ రుపానీ అత్యంత అపరిశుభ్రమైన పరిస్థితులలో ప్లాస్టిక్ కంటైనర్లలో అల్లం, వెల్లుల్లి పేస్ట్‌ను తయారు చేస్తున్నట్లు గుర్తించారు. దీని కోసం నాసిరకం ముడి పదార్థాలు, వెల్లుల్లి తొక్కలను ఉపయోగిస్తున్నట్లు తెలిపారు. ఎసిటిక్ యాసిడ్, క్సాంతన్ గమ్ పౌడర్ వంటి పదార్థాలను కలుపుతున్నాడు. దీంతో పోలీసులు అతడిని అరెస్ట్ చేశారు. మొత్తం రూ.22 లక్షలు విలువ చేసే సామగ్రిని స్వాధీనం చేసుకున్నారు.

## నేను నమ్మిన పని చేస్తూనే ఉంటా: నిహారిక



**మెగా ఫ్యామిలీ నుంచి యాంకర్‌గా ప్రయాణం మొదలుపెట్టి, నేడు సక్సెస్‌ఫుల్ నిర్మాతగా రాణిస్తున్నారు నిహారిక కొణిదెల. తన పింక్ ఎలిఫెంట్ పిక్చర్స్ బ్యానర్‌పై విభిన్నమైన కథలను తెరకెక్కిస్తూ తనదైన ముద్ర వేస్తున్నారు. అయితే, ఆమె తీసుకునే ప్రతి నిర్ణయంపై ఇండస్ట్రీలో ఏదో ఒక విమర్శ వినిపిస్తూనే ఉంది. తాజాగా తను నిర్మించిన 'రాకాస' సినిమా ప్రీ-రిలీజ్ ఈవెంట్‌లో ఈ విమర్శలపై నిహారిక చాలా ఘాటుగా స్పందించారు. "నేను 'కమిటీ కుర్రాళ్ళు' చేసినప్పుడు 15 మంది కొత్తవాళ్లను ఎందుకు పరిచయం చేస్తున్నావు? తలనొప్పులు ఎందుకు? అని అడిగారు. తీరా అది హిట్ అయ్యాక, ఇప్పుడు విజువల్ ఎఫెక్ట్‌స్‌తో 'రాకాస' తీస్తుంటే.. మళ్లీ పాత తరహా సినిమాలే చేయొచ్చు కదా అని అడుగుతున్నారు. నేనేం చేసినా నన్ను అనేవాళ్లు ఉంటారు, కానీ నేను నమ్మిన పని చేస్తూనే ఉంటా" అని గట్టిగా చెప్పారు.**

—అక్షరటుడే, సినిమా డెస్క్